దేవుడిపై కోపం

ఆకుండి

గుర్నాథానికి మహా కోపమొచ్చింది ఆవాళ!

పెళ్ళికెదిగి కూర్చున్న తన పుత్రికా త్రయంమీద కాదు.

కనీసం పెద్ద కుమార్తె పెళ్ళయినా చెయ్యలేని తన అప్రయోజకత్వాన్ని అదే పనిగా అవహేళనచేస్తున్న పెళ్లాం మీద కాదు.

తను చేస్తూన్న దరిద్రగొట్టు ఉద్యోగంమీద కాదు!

తను, తనవాళ్ళూ రోజూ తింటూన్న దరిద్రగొట్టు తిండిమీద కాదు.

ఉంటూంన్న దిక్కుమాలిన అద్దె కొంపమీద కాదు.

అతని కవాళ అంతటి మహాకోప మొచ్చింది; ఎవ్వరికీ అగుపించకుండా అంతటావున్నాడనే దేవుడిమీద!

గుర్నాథంవంటి మహాభక్తుడికి దేవుడి మీద అంతటి మహాకోపం రావడమనేది చాలా ఆశ్చర్యకరమైన విషయం! ఎంచేతంటే! ఏదో ఆపదసమయాలలో మాత్రమే దేవుణ్ణి స్మరించే టటువంటి అల్పస్థాయి భక్తుల కోవలోకి రాడు గుర్నాథం!

అతను రామాయణం చదివేడు. భారతం చదివేడు. భాగవతం చదివేడు. ఇకపోతే భగవద్గీత సంగతి సరేసరి! అది అతని నిత్యపారాయణగ్రంథం!... ఒక ఉత్తరం వ్రాసినా, చాకలి పద్దు వ్రాసినా, అసలు ఏది వ్రాసినాసరే ముందుగా కాగితంమీద 'శ్రీరామ' అని వ్రాయడం అతని కలవాటు!...రాత్రి పడుకోబోయేముందు, ఉదయం నిద్ర లేచేముందు అరచేతిపై 'శ్రీరామ' అని వ్రేలితో వ్రాసి, దండంపెట్టి, రామనామాన్ని జపించడం అతని భగవదారాధనలో ఒక భాగం!

శని, ఆదివారాలు ఒంటిపూట-సోమవారంనాడు పూర్తిగాను ఉపవాసాలు చెయ్యడం అతని ఆస్తికతకు నిదర్శనాలు!

ఇంచుమించు పదిహేనే ళ్ళవుతోంది అతను రామకోటి వ్రాయడం ప్రారంభించి!...బహుశా మరికొద్ది రోజులలో పూర్తవవచ్చు!

ఇంతట్లోనే యీ వైపరీత్యం!

కోపాన్ని అదుపులో పెట్టుకోలేక దేవుడిపై తిరగబడ్డాడు గుర్నాథం!...

మొట్టమొదట రాముడి విగ్రహాంతీని నేలకేసి కొట్టేడు. అది రాతి విగ్రహమయ్యున్నట్లయితే అంత సులభంగా అన్ని ముక్కలు కాకపోయుండేది!... సీతకి, లక్ష్మణుడికి, హనుమంతుడికి అదే గతి పట్టింది!...ఆ తరువాత పార్వతీ పరమేశ్వరుల విగ్రహాలను నేలకేసి కొట్టేడు!...

గదంతా మట్టిబెడ్డలు!

వైపు దగ్గరనుంచి బిందెతో నీళ్లపట్టుకొచ్చిన గుర్నాథం భార్య అన్నపూర్ణ, యీ దృశ్యాన్ని చూసి నిర్ఘాంతపోయింది!

"ఏఁవండీ!...ఎవరీ విగ్రహాల నిలా పగులగొట్టేరు?" అని భర్తనడిగింది.

"నేనే!" అని సమాధాన మిచ్చేడు గుర్నాథం.

"మీరా?!...మీకేం పిచ్చెత్తిందా ఏఁవిటి?...ఏఁవిటీ పని?" అని నేలమీద ముక్కముక్కలుగా పడివున్న విగ్రహాల కేసి బితుకుబితుకుగా చూస్తూ అడిగింది అన్నపూర్ణ.

"పిచ్చెత్తడంకాదే!...పిచ్చివదిలింది.. ఇన్నాళ్ళయి నన్ను పట్టుకున్న దేఁవుడి పిచ్చి యీనాటితో వదిలిపోయింది!"

"ఏఁవిటండీ యీ మాటలు?...మీ మాటలు వింటూంటే నాకేదో భయంగా వుంది!"

"దేనికే భయం?...ఈ దేఁవుళ్ళపై తిరుగుబాటు చేస్తున్నందుకుగాను యీ దేఁవుళ్ళు నన్నేమయినా చేస్తారనా నీ భయం?...మరేం భయంలేదు!...అంత పాటి శక్తి మనం దేఁవుళ్లుగా భావించి ఆరాధిస్తున్న వాళ్లెవరికీ లేదని నాకు తెలిసిపోయింది. అట్టి శక్తే వాళ్ళకున్నట్లయితే యిలా నేను నేలకేసి బాదినప్పుడు ప్రతిఘటించి ఉండేవాళ్లు!...

నిర్జీవమైన మట్టి ముద్దల్లోను, కఠినపాషా ణాలలోను ఏదో మహత్తు ఉన్నాదనే భ్రమతో యిన్నాళ్ళయి యీ నిర్జీవ పదా ర్థాలను ఆరాధించేటందుకై ఎంతో అమూల్యమైన కాలాన్ని వృధాచేసుకు న్నాను. ఇటుపైన యిట్లాంటి తెలివి తక్కువ పని చెయ్యను."

"ఇక చాలించండీ మాటలు!... తీవ్రమైన నిరాశా నిస్పృహలకు లోనై మతి స్థిమితాన్ని పోగొట్టుకున్నవారు తప్పితే మరెవ్వరూ యిలాగ మాట్లా డరు!" నీళ్లబిందెను కుదురుమీద దించుతూ అంది అన్నపూర్ణ.

"ఇప్పుడు నా మతి సక్రమమైన పద్ధ తిలో కుదటపడింది. ఇంతకాలమై నా మనస్సులో పేరుకుపోయున్న కుళ్లును సంపూర్ణంగా యీనాడు కడిగివేశాను. ఇప్పుడు నా మనస్సు నిష్కల్మషంగా ఉంది!"

"మీ రేమంటున్నది నాకు బోధ పడలేదు!"

"ఇంత స్పష్టంగా చెప్తున్నా నీకు బోధపడలేదా?...మనబోటివాళ్ళు తర తరాలనుంచీ ఆరాధిస్తున్న దేవుడు-డబ్బూ, అధికారంగల స్వార్ధపరులు సృష్టించిన ఒక జడ పదార్థం!...అంతా దైవేచ్ఛ అనే నమ్మకంతో—ఏ పనీచెయ్య కుండా—అంతా దేవుడిపై భారం వేసి సోమరిపోతుల్లాగ కూర్చోనేవాళ్ళ సంఖ్య ఏ దేశంలో అధికంగా వుంటుందో, ఆ దేశం ప్రగతిపథంలో ఒక్క అడుగు కూడా ముందుకు వెయ్యలేదు. ఇప్పు డర్థమయిందా," అంటూ భార్యముఖం లోకి అదోలాగ చూసేడు గుర్నాథం.

ఏమీ అర్థంకాలేదు అన్నపూర్ణకు;

తన భర్త ఎన్నడూ యీ తీరులో మాట్లాడలేదు!...ఇంతకీ ఏంజరిగింది?.. ఈ వైపరీత్యానికి హేతువేమిటి?...రామ కోటి వ్రాసేటప్పుడు ఏదయినా దోషం జరిగితే బెడిసికొడుతుం దంటారు!... కొంపతీసి బెడిసికొట్టలేదు కదా ! ... ఏమో! దాని ఫలితమే యీ వాగు డేమో!...

అన్నపూర్ణకు భయమేసింది!...ఎవరి నైనా పిలవాలనుకుంది!...వీధిలోకెళదా మని బయలుదేరబోసరికి పెద్ద కూతురు సీత ఎదురయింది.

"సీతా!...మీ నాన్నగారికి పిచ్చెత్తి నట్లుందే!...దేవుళ్ళ విగ్రహాలన్నీ నేల కేసి చితక్కొటేరు...దైవదూషణ చేస్తు న్నారు,...పరమ ఆస్తికులయిన మీ నాన్నగారు యిలా ఆకస్మాత్తుగా నాస్తి కులుగా మారిపోడం చూస్తే నాకేదో భయంగా వుంది. వారి మతి చలించిం దేమోనని నా కనుమానంగావుంది!" అని చెప్పింది అన్నపూర్ణ.

సీత, గాభరాగా తండ్రిదగ్గరకొచ్చి, "నాన్నగారూ!...ఏమిటిదంతా?" అనడి గింది; నేలపై చెల్లాచెదురుగా పడివున్న

దేవతావిగ్రహాల ముక్కలకేసి ఆందోళ నతో చూస్తూ.

''ఇవన్నీ ఎత్తిపారేయి వెంటకుప్ప మీద!'' అని అన్నాడు పాదాలతో చితికిన విగ్రహాలముక్కలను ఒక దగ్గరకు కూడదీస్తూ.

''ఇంతకీ ఏమయింది నాన్నగారూ? ...ఇవాళ దేవుడిపై మీ కింత కసి ఎందుకేర్పడింది?'' అనడిగింది సీత.

''ఇంతకాలమయి ఈ ప్రపంచంలో ఒక్క దేవుడే సత్యమని అనుకున్నాను. కాని దేవుడే అసత్యమని, ప్రకృతే సత్యమని యిప్పుడు తెలుసుకున్నాను!...''

"నాన్నగారూ!...మీ మనస్సు పై ఏదో గట్టిదెబ్బే తగిలినట్లుంది! లేకపోతే మీరిలా మాట్లాడరు. ఏం జరిగిందో చెప్పండి;..." అని తండ్రిముఖంలోకి పరిశీలనగా చూస్తూ అడిగింది.

గుర్నాథం అదోలాగ నవ్వి, "చెప్పమంటావా?...చెపితే మీ అమ్మ పిచ్చెత్తిపోతుంది!...లేదా ఆత్మహత్య చేసుకుంటుంది!" అని అన్నాడు.

ఏమీ అర్థంకాక ఆ తల్లీకూతుళ్ళిద్దరూ ఒకరి ముఖా లొకరు అయోమయంగా చూసుకున్నారు.

అన్నపూర్ణ ఎంతో ఆందోళనతో, "ఇంతకీ ఏంజరిగిందండి! చెప్పండి?'' అనడిగింది.

"చెపితే నువ్వు భరించలేవు!'' అన న్నాడు గుర్నాథం.

"భరిస్తాను. ఎంతటి విషాదాన్నయినా భరిస్తాను. వేగంగా చెప్పండి." అని తొందరచేసింది.

"చెప్తాను. చెప్పేముందు నీ రెండో కూతురు లక్ష్మిని ఓ సారి యిలా పిలువు!" అని అన్నాడు.

"అది యింట్లోలేదు!'' అని సమాధాన మిచ్చింది అన్నపూర్ణ.

''ఇంట్లోనేకాదు; ఊళ్లోకూడాలేదు!" అని నెమ్మదిగా అన్నాడు గుర్నాథం.

ఆ మాట వినగానే అన్నపూర్ణగుండె వేగంగా కొట్టుకో సాగింది!...సీత మనస్సు ఆందోళనతో ఆరాట పడ సాగింది!

"లక్ష్మి ఎక్కడి కెళ్ళింది నాన్నగారూ?" అని ఎంతో ఆందోళనతో అడిగింది సీత.

"ఏమో?...తెలీదు!...అది వ్రాసిన యీ ఉత్తరంలో వివరాలేమీ లేవు!" అని ఓ ఉత్తరాన్ని సీతచేతికి అందించి, ''మీ అమ్మకు చదివి వినిపించు!'' అని అన్నాడు.

సీత ఆత్రంగా ఉత్తరం మడతవిప్పి, ఓ సారి మనస్సులో చదువుకొని బాధగా నిట్టూర్చింది!...

"ఏమని వ్రాసిందే?...బయటకు చదువే?" అని గుండె బిగబట్టుకొని అడిగింది అన్నపూర్ణ.

'చదువుతాను వినుః...“ప్రియమైన నాన్నగారికి నమస్కారములుః... మీ భగవదారాధన వెనకాల మీ పిల్లలంతా గౌరవప్రదంగా, ఆనందంగా జీవించేటట్లు వరమివ్వమనే ప్రార్థన ఉన్నదని నాకు తెలుసుః...అందుకని మీరు ఓ వ్యక్తిత్వంగల పురుషుడుగా చెయ్యవలసినదేఁవీ చెయ్యకుండా-యింతకాలమయి కర్తవ్యశూన్యులై భగవదారాధన అనే పేరుతో ఓ సోమరిపోతులా కాలం గడిపేరుః...సంప్రదాయమనే ఉక్కుచట్రంలో యిరుక్కుపోయి-మూఢాచారాల ఇనుప చక్రాలక్రింద నలిగిపోతూ చావలేక, చావురాక బ్రతుకుతున్నాం మనంః...మన యీ దౌర్భాగ్యస్థితికి ఓ ముగింపు నివ్వాలనే సంకల్పం కల్గింది నాకుః...అందుకనే నేను మీకు దూరమవాల్సొచ్చిందిః నన్ను మన్నించండిః...మీ లక్ష్మి.”......విన్నావా అమ్మాః...మన దౌర్భాగ్యస్థితికి లక్ష్మి యిచ్చిన ముగింపుః...” అనంది సీత అశ్రుపూరిత నయనాలతో.

తన పాదాలక్రింద వున్న భూమి ఒక్కసారి విచ్చిపోయినట్లనుభూతి నొందింది అన్నపూర్ణ. ఆమె గుండె గొంతుకలో కొట్టాడసాగింది. ఏదో అడగాలనుకుంది. కాని ఆమె గొంతుకలోంచి ఏమాటా వెలువడలేదు.

“నాన్నగారూః...లక్ష్మి ఎక్కడికి వెళ్ళుంటుందిః” అనడిగింది సీత; పొంగి వస్తున్న దుఃఖాన్ని బలవంతంగా అణచుకుంటూ.

“బహుశా చావడానికి వెళ్ళుంటుందిః” నిర్లిప్తంగా చూస్తూ సమాధానమిచ్చేడు గుర్నాధం.

“అయ్యయో ః ... ఏఁవిటండీ యీ మాటలుః...తక్షణం పోలీసు రిపోర్టివ్వండిః...వెతికించండిః” అనంది అన్నపూర్ణ రుద్ధకంఠంతో.

గుర్నాధం బాధగా నిట్టూర్చి, “ఏఁవని

రిపోర్టిమ్మంటావు?...ఏ సిమడితోనైనా లేచిపోయిందనా?—లేక ఏ దౌర్భాగ్యుడైనా దానిని వంచించి లేవదీసుకుపోయేడనా?—ఏమనిమ్మంటావు రిపోర్టు?— ఇంతకీ అది ఎంతో మంచి పని చేసింది. దాని బాధ మన కొదిలిపోయింది!'' అని అన్నాను.

''ఏమిటి?—దాని బాధ మన కొదిలిపోయిందా?—కన్న తండ్రిగా మీ రనవలసిన మాటేనా యిది?'' దుఃఖమిశ్రితమైన కోపంతో భర్తముఖంలోకి అసహ్యంగా చూస్తూ అడిగింది అన్నపూర్ణ.

"ఇంకేం వనమంటావే—ఓ కన్న తండ్రిగా కన్నపిల్లలకు నేనేం చేశాను?... ఏమీ చెయ్యలేదు!—ఆ భగవంతుడే ఏదో చేస్తాడనే నమ్మకంతో నే నింతకాలమయి భగవదారాధన అనే ముసుగులో ఒదిగి కూర్చున్నాను. నా చేతకానితనాన్ని, అప్రయోజకత్వాన్ని, అయోగ్యతను భగవద్విలాసమనే తెరమరుగున మరుగుపరచేను! అంతా కర్మబద్ధులనే నమ్మకంతో కర్తవ్యాన్ని విస్మరించేను నేను! నా రక్తాన్ని పంచుకు పుట్టిన నా కన్న కూతురు లక్ష్మి నాకీనాడు కర్తవ్యాన్ని బోధించింది. అందుకు దానికి నే నెంతయినా ఋణపడి వుంటాను!" గుర్నాధం గొంతుక బొంగురుపోయింది! — ఊపిరి ఆడనివ్వని జుగుప్సాకరమైన కఫంలాగ అతని గొంతుకలో అవ్యక్తమయిన బాధ కొట్లాడసాగింది!—

సీత ఆందోళనలో, "నాన్నగారూ!—మీ మాటలు వింటూంటే నాకేదో భయంగావుంది!" అనంది.

"ప్రతి దానికీ భయపడేవాళ్ళి లోకంలో ఏ పనీ చెయ్యలేరు." అని కొంచెంసేపాగి-గొంతుక సవరించుకొని, "పిరికివాళ్ళీ వ్యవస్థలో సుఖపడలేరు. సుఖపడాలంటే పిరికితనాన్ని త్యజించాలి. తమ స్వశక్తిపై నమ్మకంలేనివాళ్ళే పిరికివాళ్ళవుతారు. పిరికివాళ్ళే పూర్తిగా భగవంతుడిపై భారంవేసి - పురుషప్రయత్నం మానేసి సోమరిపోతులాగ జీవిస్తారు! ఇకపోతే——" గుర్నాధం యింకా ఏదో చెప్పబోతూండగా మధ్యలో అన్నపూర్ణ అడ్డుతగిలింది.

"ఇక చాలించండి మీ ఉన్యాసం! — మీ ఉపన్యాసాన్ని తీరిగ్గా వినగలిగే సహనం, స్థైర్యం మా కిప్పుడు లేవు. ముందు కర్తవ్యాన్ని ఆలోచించండి." అనంది చిరాగ్గా.

"ఇహ ఆలోచించడానికేముంది?—అది వెళ్ళిపోయింది! చావడానికే వెళ్ళిపోయిందో, సుఖంగా బ్రతకడానికే వెళ్ళిపోయిందో మనకి తెలీదు! — ఇంతకీ అది చిన్నపిల్లేం కాదు. నాకే కర్తవ్యాన్ని బోధించిన లక్ష్మి-తన కర్తవ్యాన్ని తాను ఎన్నడూ విస్మరించదు. నా కిప్పుడు దానిగురించి ఏ విచారం లేదు! నా కిప్పుడున్న విచారమల్లా సీత గురించే!" అని భార్యముఖంలోకి బాధగా చూస్తూ అన్నాడు.

తండ్రి అలా అనేసరికి సీత తెల్లబోయింది!... "నా గురించి మీ కెందుకు విచారం నాన్నగారూ?" అనడిగింది.

"ఇప్పుడు నీ వయస్సెంతో తెలుసా?...ముప్ఫైఏళ్ళు!...నీకు నేనింతవరకూ పెళ్ళిచెయ్యలేకపోయేను. ఎందువల్లో తెలుసా? దారిద్ర్యంవల్ల!...నేటి మన యీ సమాజాన్ని ధనం శాసిస్తోంది. ధనానికున్న విలువ నేటి యీ సమాజంలో మరి దేనికీలేదు. ధనం యిమ్మనమని భగవంతుడిని ప్రార్థించడంకోసం వినియోగించిన కాలాన్ని, ఏదో ఒక విధంగా ధనాన్ని సంపాదించడం కోసం కాని-ధనానికి అట్టే విలువలేని సమసమాజ స్థాపనకోసం కృషిచేస్తున్నవారికి సహకరించడంకోసం గాని వినియోగించుంటే ఒక మంచిపని చేశాననే సంతృప్తయినా నాకు మిగిలుండేది!... ఇప్పుడు..."

"నాన్నగారూ!...మీరు మళ్ళీ ఉద్రిక్తులవుతున్నారు. ఈ సమయంలో మీరీరకంగా ఉద్రిక్తులవడం మంచిదికాదు!... లక్ష్మి ఎక్కడున్నదీ నేను భోగట్టా చేస్తాను. మీరు నిర్విచారంగా వుండండి!" తండ్రిని శాంత పరచేటందుకు పూనుకుంది సీత.

అదే సమయంలో సీత రెండో చెల్లెలు ఉమ కాలేజీనుంచి వచ్చింది.

ఉమ ముఖంలోకి గుర్నాథం ఓ పిచ్చివాడిలాగ చూస్తూ, "ఆ మధ్య నువ్వు ఎవరితోనో తిరగడంచూసి — వాడితో ఎప్పుడూ తిరగొద్దని నిన్ను మందలించేను...నిన్ను ఆనాడలా మందలించినందుకు యిప్పుడు నేనెంతో విచారిస్తున్నాను!...నీ యిష్టమొచ్చినట్లు నీ యిష్టమొచ్చిన వాడితో తిరుగు, నేనేమీ అనను. బాగా డబ్బు సంపాదించడంకోసం యిటుపైని నువ్వేంచేసినా నే నానందిస్తాను. బోధపడుతోందా నేను చెప్తున్నది!... నేను చాలా స్పష్టంగానే చెప్తున్నాను. ఎంతటి అవివేకులకయినా బోధపడేటంత తేటతెల్లంగా చెప్తున్నాను!...మన ధ్యేయం ఏదో విధంగా డబ్బు సంపాదించడం!...తెలిసిందా?" అన్నాడు.

ఉమ కేమీ అవగతమవలేదు. తల్లికేసి, అక్కయ్యకేసి అయోమయంగా చూడసాగింది!...

సీత తండ్రి దగ్గర కెళ్ళి దీనంగా అతని ముఖంలోకి చూస్తూ "ఊరుకోండి నాన్నగారూ!...మీ ధోరణి చూస్తుంటే మా కందరికీ మతిపోతోంది. లక్ష్మి ఏమయిందా అనే బెంగతో యిప్పటికే అమ్మ సగం క్రుంగిపోయింది. మీరీ తీరులో యింకా మాట్లాడినట్లయితే అమ్మ ఏమయిపోతోందోనని నాకు బెంగగా వుంది," అని అంది.

"అవునే!...నీకు బెంగగానే ఉంటుంది!...ఓ ఎబెండరుగా పని చేస్తున్న మీ యీ నాన్న యీ కుటుంబాన్ని పోషించలేడనే బెంగతోనేగా నువ్వు ఉద్యోగం వెలగబెడుతున్నావు!— ఎవడినో ఒకడిని పెళ్ళిచేసుకొని అత్తా

రింటికి పోతే-నీ ఈదరిద్రగొట్టు నాన్కొక్కడూ యీ కుటుంబాన్ని పోషించలేడనేగా ప్రకృతి సహజమైన వాంఛల్ని చంపుకొని మరీ నువ్వీ ఉద్యోగం చేస్తున్నావు?...నాకు తెలుసే నీ సంగతి?... నీ కోసం నువ్వు బ్రతకడం లేదే!... నువ్వు మా కోసం బ్రతుకున్నావు!... సుఖమంటే ఏవిటో నీకు తెలుసా?... నీ కిప్పుడు ముప్పైఏళ్ళు. నీకు పెళ్ళి... నీకు పెళ్ళి..." గుర్నాథం నోట్లోంచి యింకేమాటా వెలువడలేదు. కుప్పలా కూలిపోయేడు.

అన్నపూర్ణ కెవ్వుమని కేకేసి భర్త దగ్గరకెళ్ళి అతని ముఖాన్ని చేతులతో తడుపుతూ, "ఏవండీ!...ఏమయిందండీ?...మాట్లాడరేమండీ?" అని ఏడవసాగింది.

సీత ఎంతో ఆందోళనతో, "ఒసేయి ఉమా!...అర్జంటుగా వెళ్ళి డాక్టర్ని తీసుకురా!" అని అంది. ఉమ డాక్టర్ని తీసుకొచ్చేటందుకై పరుగెట్టింది.

సీత తండ్రి ముక్కుదగ్గర చెయ్యి పెట్టి చూసింది. ఊపిరి ఆడుతోంది. ఆమె గుండె కాస్త కుదటపడింది!

తన తండ్రిలాగే యీనాడు చాలా మంది భగవంతుడిని కోర్కెల నీడేర్చే మహామహిమాన్వితుడైన ఓ అపురూప వ్యక్తిగా భావించి ఆరాధిస్తున్నారు!... అందుకనే యీ రకమైన నిరాశానిస్పృహలకు లోనవుతూ కుమిలిపోతున్నారనుకుంది సీత.

దైవాన్ని సమాజరూపంలో దర్శించి సేవించమని మన ప్రాచీన భారతీయ సంస్కృతి చెపుతోంది!...దేహధారణ కొరకు ఎంత అవసరమో అంత మాత్రమే స్వీకరించమని, అంతకన్నా ఎక్కువ స్వీకరించడం దొంగతనమవుతుందని-అట్లా కనీసావసరాలకు మించి అధికంగా సంపాదించేవారంతా దండనార్హులని 'మనువు' స్పష్టంగా చెప్పేడు!...సమాజ సేవే దైవసేవనే ప్రాచీన హిందూ ధర్మాన్ని మనం ఖచ్చితంగా ఆచరించున్నట్లయితే ఈనాడీ కరమైన వికృతపరిస్థితు లీ సమాజంలో తలెత్తి వుండేవికావని సీత అభిప్రాయం.

కష్టసుఖాలనేవి మనిషియొక్క మానసిక పరిపక్వతపైన, విచక్షణా జ్ఞానంపైన ఆధారపడుండే అనుభూతులు!...

తను సుఖపడలేదేమోనని తన తండ్రి బాధ!

తనకి తండ్రి ఆరకమైన బాధలేకుండా చెయ్యాలనుకుంది సీత!

తెలివొచ్చిన వెంటనే త నేరకంగా సుఖపడుతున్నదీ తండ్రికి వివరంగా తెలియజెయ్యా లనుకుంది సీత!

డాక్టరొచ్చేడు. చూసేడు. బహుశా మెదడులో రక్తనాళం చిట్లివుండవచ్చునన్నాడు. తక్షణం విశాఖపట్నం కింగ్ జార్జి ఆసుపత్రికి తీసుకుపొండన్నాడు!

కాని గుర్నాథాన్ని విశాఖపట్నం తీసుకెళ్ళాల్సిన అవసరం మరి లేక పోయింది!